ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Thursday , October 12, 2006 20:24 hrs IST

# 'భారత మిత్ర' అమెరికన్ సెనేటర్ జాన్ కార్నిన్

(ఈనాడు-ఇంటర్‌నెట్ డెస్క్)



డల్లాస్: భారత-అమెరికాల మధ్య స్నేహాన్ని పెంపొందించేందుకు విశేషంగా కృషి చేస్తున్న అమెరికన్ సెనేటర్ జాన్ కార్నిన్‌ను 'ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్' (ఐ.ఏ.ఎఫ్.సి) టెక్సాస్ విభాగం 'భారత మిత్ర' అవార్డుతో ఘనంగా సత్కరించింది. సోమవారం స్థానిక 'ఫన్ ఏషియా' ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఐ.ఏ.ఎఫ్.సి కార్యవర్గ సభ్యులు పీయూష్ పటేల్, సి.ఆర్.రావు, ఐ.ఏ.ఎఫ్.సి టెక్సాస్ విభాగ సమన్వయకర్త ప్రసాద్ తోటకూర, తయ్యాబ్ కుందన్ వాలా తదితరులు కార్నిన్ సత్కరించారు. భారత-అమెరికాల మధ్య అణు ఒప్పందం, వాణిజ్య, ఆర్థిక, పారిశ్రామిక, సైనిక సహకారాల్ని పెంపొందించడంలో కార్నిన్ చేసిన సేవల్ని వివరిస్తూ సెనేటర్‌ను తోటకూర ప్రసాద్ సభాసదులకు పరిచయం చేశారు. ఇరుదేశాల మైత్రికి జాన్ కార్నిన్ చేసిన సేవలు అనుపమానమైనవని ప్రముఖ రిపబ్లికన్ పార్టీ అనుకూలవాది కృష్ణ శ్రీనివాసతో పాటు కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు.

## *దక్షిణాసియాలోని పరిణామాల్ని గమనిస్తున్నాం: కార్నిన్*

కార్నిన్ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ పాక్ అణుశాస్త్ర పితామహుడు ఏ.క్యూ.ఖాన్ అందించిన అణు సహకారంతోనే ఉత్తర కొరియా అణుపరీక్షలు చేయగలిగిందని ఆరోపించారు. దక్షిణాసియాలోని పరిణామాల్నీ, తీవ్రవాదుల ఆగడాల్నీ అమెరికా అధ్యక్షుడు బుష్ జాగ్రత్తగా గమనిస్తున్నారనీ, తగిన సమయంలో తగిన చర్యలు తీసుకుంటారనీ ఆయన వివరించారు. తీవ్రవాదంపై అలుపెరగని పోరును అమెరికా కొనసాగిస్తూనే ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. 'ఇరాన్‌కు కూడా పాక్ అణుపరిజ్ఞానాన్ని అందిస్తోంది' అని అంటూనే... అవి తీవ్రవాదుల చేతుల్లోకి చేరే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భారత్-అమెరికాల అణు ఒప్పందం సెనేట్ ఆమోదం పొందేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అమెరికా అభివృద్ధిలో భారత సంతతి మేధావుల సేవలు అనిర్వచనీయమైనవని ఆయన కొనియాడారు. ఇరు దేశాల ప్రజల మధ్య మైత్రీ భావం పెంపొందించేందుకు ఐ.ఏ.ఎఫ్.సి చేస్తున్న కృషిని సెనేటర్ అభినందించారు. పౌరసత్వం, ఇమిగ్రేషన్‌ల విషయంలో తాము అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నామంటూ.. కొందరు ప్రవాస భారతీయులు అడిగిన ప్రశ్నలకు కార్నిన్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యలు తన దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

